ప్రజాశక్తి
గురువారం 25 జులై 2024 5 అనంతపురం

కేశవ్‌పై.. 'అనంత' ఆశలు..!

◆ నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్

◆ పంటనష్ట పరిహారానికి రైతుల ఎదురుచూపు

◆ సాగునీటికి నిధులు విడుదల చేసేరా..?

రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కేశవ్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఆశాజనకంగా నిధులు వస్తాయన్న ఆశతో ప్రజలు ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ మేరకు ఉమ్మడి జిల్లాకు నిధులు వస్తాయన్న దానిపై ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత ఐదేళ్ల కాలంలో జిల్లాలో సాగునీటి రంగాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలున్నాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని అప్పట్లో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీనిచ్చారు. ఈ మేరకు టెండర్లు కూడా పిలిచారు. ఐదేళ్లు పూర్తయినా పనులు మాత్రం ముందుకు కదల్లేదు. నిధుల కేటాయింపులూ జరగలేదు. అంతకు మునుపు పెండింగ్‌లో ఉన్న పనులు కూడా ఈ ఐదేళ్లలో ముందుకు సాగలేదన్న విమర్శలున్నాయి. భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతల పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తామని ప్రకటించారు. ఇది కూడా ప్రకటనలకే పరిమితం అయ్యింది. ఇక తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తిగా ఆగిపోయింది. గత ప్రభుత్వ హయాంలో కనీసం మరమ్మత్తులకైనా రూ.30 కోట్లు ఇవ్వాలని అధికారులు చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. ఐదేళ్లలో బడ్జెట్ కేటాయింపుల్లేక నిర్వహణ కూడా లేకుండాపోయింది. దీంతో నీరొచ్చినప్పుడల్లా ఎక్కడ గండ్లు పడుతాయోనన్న గుబులు అందరిలోనూ నెలకొంది. ఈ పరిస్థితుల్లో కొత్త ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో వీటి ప్రస్తావన తీసుకొస్తారా.. లేదా.. అని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు. 2023 సంవత్సరంలో వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. పంటనష్టాన్ని అంచనా వేశారు. బడ్జెట్‌లో దీనిపైనా ప్రభుత్వం ఏమైనా ప్రకటన చేస్తుందాని రైతులు ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా పట్టు రైతులు, రీలర్లు ఇన్‌సెంటివ్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. వీటిపై కూటమి ప్రభుత్వం ఏప్రకటన చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై ఎన్నికల ముందు టిడిపి నాయకులు అనేక హామీలను ఇచ్చారు. ఆ హామీల మేరకు అభివృద్ధి పనులకు ఏ మేర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందన్నది నేడు తేలనుంది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా... అంగన్వాడీ నుంచి పాఠశాలు, కళాశాలల వరకు అడ్మిషన్ పొందాలన్నా.... బ్యాంకుల్లో ఖాతా తెరవాలన్నా.... ప్రభుత్వం ద్వారా ఏ చిన్న పని చేసుకోవలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. ఇంత ప్రాధాన్యత గల ఆధార్ కార్డుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఇటీవల ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇంకా 4,74,537 మంది ఆధార్ కార్డులను అప్ డేట్ చేయాల్సి ఉంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆధార్ అప్ డేట్ కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ శిబిరాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ఆధార్ నమోదుకు హిందూపురం బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో క్యూ కట్టిన ప్రజలు

నత్తనడకన ఆధార్ అప్‌డేట్

◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంకా 4,74,537 మందివి పెండింగ్

◆ 27వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్

హిందూపురం 6వ వార్డు సచివాలయంలో ఆధార్ సేవలను అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5-15 సంవత్సరాల వయస్సున్న వారు 2,09,177 మంది, 15-17 సంవత్సరాల వయస్సున్నవారు 2,02,062, 18 సంవత్సరాల పై బడి ఉన్నా వారు 63,298 మంది మొత్తం 4,74,537 మందికి సంబంధించిన ఆధార్ కార్డుల డాక్యుమెంట్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు 18,98,374 మంది ఆధార్ కార్డులు అప్ డేట్ చేయాల్సి ఉంది. ఆధార్ లేని వారికి నూతన ఆధార్ నమోదు చేయడంతో పాటు బయోమెట్రిక్ వంద శాతం పూర్తి చేయడం కోసం ఇప్పటికే నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. వీటితో పాటు సచివాలయాలు, పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఓలు పరిశీలించి నిర్దిష్ట సమయంలో పూర్తి అయ్యే విధంగా చూడాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉమ్మడి జిల్లాలో శ్రీ సత్యసాయి జిల్లాకు 109 కిట్లు ప్రభుత్వం సరఫరా చేస్తే ఇందులో 52 పని చేస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 133 కిట్లు ఉంటే 82 కిట్లు పని చేస్తున్నాయి. హిందూపురం పురపాలక సంఘంలో అయితే 5 సచివాయాల ఎడ్యూకేషన్ సెక్రెటరీలకు శిక్షణ ఇచ్చి ఆధార్ సేవలను అందించాలని అధికారులు సూచించారు. దీంతో పురపాలక సంఘంలోని 6, 28, 14, 38, 34 వార్డు సచివాయాల్లో ఆధార్ సేవలను అందించాల్సి ఉంది. 6వ వార్డు సచివాలయంలో మాత్రం తూతూమంత్రంగా సేవలు అందుతున్నాయి. ఇక్కడ సిబ్బంది తక్కువ ఉండడంతో ఉదయం వేళల్లో సచివాలయాల సేవలను అందించి, మధ్యాహ్నం నుంచి ఆధార్ సేవలను అందిస్తున్నారు. మిగిలిన 4 సచివాయాల్లో సరఫరా చేసిన కిట్లు పక్కన పడేశారు. దీంతో ప్రజలకు ఆధార్ సేవలు అందడం లేదు. ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసిన సమయాల్లో సైతం ఈ సచివాలయాల్లో ఆధార్ సేవలను అందించడం లేదు. పట్టణంలో ఇప్పటికే బిఎస్ఎన్ఎల్, పోస్టు ఆఫీసుతో పాటు బ్యాంకుల్లో నడుస్తున్న కేంద్రాల్లో ఆధార్ సేవలు అందుతున్నాయి. ఇక సచివాలయాల పరిధిలో ఆధార్ ప్రత్యేక శిబిరంపై విస్తృత ప్రచారాలు నిర్వహించి వంద శాతం పూర్తి జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అయితే అధికారుల పర్యేక్షణ లోపంతో మిగిలిన సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పని చేయడం లేదు.

కనిపించని ఆధార్ మొబైల్ క్యాంపులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 రోజుల పాటు నిర్వహించే ఆధార్ ప్రత్యేక శిబిరంపై అధికారులు విసృతంగా ప్రచారం నిర్వహించి, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిబిరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాలో మొదటి రోజు ఒక్క చోట కూడా ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయలేదు. కనీసం ఈ విషయాన్ని మీడియాకు అధికారులు తెలపలేదు. మొబైల్ క్యాంప్‌ల నిర్వహణ కోసం ఆధార్ ఆపరేటర్లను నియమించి, సేవలను విస్తృతంగా చేపట్టాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆధార్ అప్‌డేట్ సేవలతో పాటు ఇతర సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. అధికారులు ఇప్పటికైన దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అందరికీ ఆధార్ సేవలు అందే విధంగా చూడాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

శింగనమల టిడిపిలో ఆధిపత్య పోరు

బికెఎస్‌లో తమ్ముళ్ల కొట్లాట

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

శింగనమల అధికార పార్టీ తెలుగుదేశంలో అప్పుడే ఆధిపత్య పోరు మొదలైంది. రేషన్ షాపుల కోసం బుక్కరాయసముద్రం తహశీల్దార్ కార్యాలయంలోనే తమ్ముళ్లు కొట్లాడుకున్నారు. ఎస్సీ నియోజకవర్గం అయిన శింగనమలలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ విజయం సాధించారు. ఈమె గెలుపు కోసం ఆయా గ్రామాల్లో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పని చేశాయి. అధికారంలోకి రాగానే వీరంతా ఏదో ఒక విధంగా ప్రభుత్వ లబ్ధిని పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా రేషన్‌షాపులు, ఫీల్డ్ అసిసెంట్లు, యానిమేటర్ పోస్టులకు పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. రేషన్ షాపులను దక్కించుకోవడంలో భాగంగా బుధవారం ఉదయం బుక్కరాయసముద్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏకంగా ఒక వర్గం టిడిపి నాయకులు ధర్నా చేసేందుకు సిద్ధ పడ్డారు. ఇదే సమయంలో మరో వర్గం వారు దీనిని అడ్డుకున్నారు. ఒక సమయంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. కార్యాలయం వద్ద ఘర్షణ జరుగుతుండడంతో సిఐ వెంకటేశ్వర్లు వెంటనే సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఇరు వర్గాలకు సర్ధిచెప్పి అక్కడి నుంచి పంపించారు. అధికారం చేపట్టి కనీసం రెండు నెలలు కూడా గడవకనే అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల్లో ఈ విధమైన విభేదాలు తలెత్తెడం ఆ పార్టీ శ్రేణులను విస్మయానికి గురి చేస్తోంది.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఘర్షణ పడుతున్న టిడిపి నాయకులకు సర్ధిచెబుతున్న సిఐ

కంది పొలంలో రైతులతో మాట్లాడుతున్న డిఎఒ ఉమామహేశ్వరమ్మ

ఖరీఫ్ సాగుపై డిఎఒ సమీక్ష

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సంబంధించి జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మూడు మండలాలకు సంబంధించిన రైతు సేవా కేంద్రం సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహిం చారు. ఇప్పటి వరకూ సాగు చేసిన పంటల వివరాలు, మట్టి నమునాల సేకరణ, వాటి స్థితి, పంటలు సాగైన విస్తీర్ణం, సిసిఆర్‌సి కార్డ్స్ రెన్యూవల్, రైతులకు సూచనలు, పిఎం కిసాన్ సమస్యలు, పొలంబడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆరా తీయడంతో పాటు పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని రాతిబావి వంక గ్రామంలో కంది పొలాన్ని పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆమె వెంట ఎడిఎ లక్ష్మానాయక్, వ్యవసాయ అధికారులు నిర్మల్‌కుమార్, క్రిష్ణకిషోర్‌రెడ్డి, సాయికుమార్, ఎఇఒ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-నార్పల

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సిహెచ్ఒ బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక వైద్యశాల ఆవరణలో బుధవారం వైద్యులు ప్రవీణ్‌కుమార్, సాధియా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని, లేకపోతే భవిష్యత్తు తరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ రోజు నాటిన మొక్కల్లో వైద్యశాలలో విధులు నిర్వహించే ఒక్కో ఉద్యోగి ఒక్కో మొక్క సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అక్కులప్ప, ఎఎన్ఎం ప్రమీల, ల్యాబ్ టెక్నీషియన్ అరుణ, వైద్యశాల సిబ్బంది రాజేంద్ర, అక్షిత, ఎర్రిస్వామి, అనసూయమ్మ, రామలింగ, తదితరులు పాల్గొన్నారు.

అనంత కార్పొరేషన్‌లో బదిలీలలు..!

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ బదిలీల్లో ఓ అధికారి చేతివాటం చూపించారన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో జోరుగా నడుస్తోంది. గతంలో పనిచేసినచోట చూపిన చేతివాటమే ఇక్కడ కూడా ఆ అధికారి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీల్లో నిబంధనలను గాలికొదిలేసి, అధికారి చేతివాటం చూపారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఏడాది కాలం ముగియకుండానే గుమాస్తాల బదిలీల్లో సీట్ల మార్పిడి జరిగిన తంతు చూస్తే పెద్ద మొత్తంలోనే కాసులు చేతులు మారాయన్న విమర్శలు బలంగా విన్పిస్తున్నాయి.

◆ గుమాస్తాల బదిలీల్లో గందరగోళం

◆ సీనియర్ అసిస్టెంట్లకు జూనియర్... జూనియర్లకు సీనియర్ అసిస్టెంట్ల స్థానాలు కేటాయింపు..!

◆ నిబంధనలు గాలికి..

◆ చేతివాటం చూపిన ఓ అధికారి.!?

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మెప్మాలోని ఒకే సీటుకు ఇద్దరు గుమాస్తాలను నియమించి, అక్కడ పనిచేసే సీనియర్ అసిస్టెంట్ బాలాజీని ఎక్కడికి బదిలీ చేశారన్న విషయాన్ని ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లోని జూనియర్ అసిస్టెంట్ యుగంధర్ రెడ్డిని మెప్మా విభాగానికి గుమాస్తాగా నియమిస్తూ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బదిలీతో ఇద్దరు గుమాస్తాలు మెప్మాలో పని చేయాల్సి ఉంటుందా అన్న సందేహం ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది. మూడు సంవత్సరాలకు పైబడి ఒకే సీటులో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాల్సి ఉండగా, ఆ అధికారి ఏడాది కాలం కూడా ఒక సీటులో పనిచేయుని ఉద్యోగులను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గత కమిషనర్ మేఘస్వరూప్ పాలన కాలంలో గుట్టు చప్పుడు కాకుండా సూపరింటెండెంట్, గుమాస్తాల బదిలీలు హడావుడిగా జరిగాయి. నాలుగు సంవత్సరాలకు పైబడి ఒకే సీటుకు పరిమితమై పనిచేస్తున్న వారు అటు మున్సిపల్ కార్పొరేషన్, ఇటు నగర పాలకొన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు ఎక్కువమంది ఉన్నారు. వారెవరినీ బదిలీ ప్రక్రియలో చేర్చకుండా కేవలం ఏడాదికి పైగా పని చేసిన వారికి బదిలీల్లో చోటు కల్పించడం చూస్తే సదరు అధికారి వారికి ఇచ్చిన ప్రాధాన్యత ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వారిని జూనియర్ అసిస్టెంట్ల సీట్లలోకి మార్చడంపైనా అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సీనియర్ అసిస్టెంట్ సునీల్ ప్రస్తుతం హెచ్-1 సీటులో ఏడాది కాలంగా పని చేస్తున్నారు. ఆయన్ను రెవెన్యూ విభాగంలో ఇన్‌ఛార్జి యుడిఆర్‌ఐగా నియమించారు. నెలరోజుల సెలవులో ఉన్న వేణుగోపాల్ తిరిగి విధుల్లో చేరితే సునీల్ తిరిగి హెచ్-1 అసిస్టెంట్‌గానే కొనసాగాల్సి ఉంటుంది. ఇంత స్వల్ప కాల వ్యవధికే ఆఘమేఘాలపై మార్పులు చేయాల్సిన అవసరం ఏమిటన్నది బదిలీ చేసిన ఆ అధికారికే తెలియాలని ఉద్యోగులు చెబుతున్నారు. రెవెన్యూ విభాగంలోని వేణుగోపాల్ సెలవులో ఉండటంతో ఆ బాధ్యతలను ఎస్ఆర్ బాబుకు గత కమిషనర్ మేఘ స్వరూప్ అప్పగించారు. ఆ ఉత్తర్వులను ఆగమేఘాల మీద అధికారి మార్చేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఎస్టాబ్లిష్‌మెంట్ సీటు సి1 బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశాబేగంను జూనియర్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ విభాగానికి మార్చారు. సీనియర్ అసిస్టెంట్‌ను జూనియర్ సీటుకు కేటాయించటం ఏ నిబంధనల మేరకు వస్తుందనేది బదిలీ చేసిన అధికారికే తెలియాల్సి ఉంది. జూనియర్ అసిస్టెంట్ వి.సాయి శరత్‌కుమార్‌కు కీలకమైన ఎస్టాబ్లిష్‌మెంట్ సీటును కేటాయించారు. అయితే సాయి శరత్ కుమార్ రెవెన్యూ విభాగంలో ఏ-1గా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ రెండు సంవత్సరాల కాలం మాత్రమే విధులు నిర్వహించారు. ఉన్నఫలంగా ఆ ఉద్యోగిని బదిలీ చేశారు. రెవెన్యూ విభాగంలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ సావిత్రమ్మను హైస్కూల్‌కు బదిలీ చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఎం.యుగంధర్ రెడ్డిని మెప్మా క్లర్క్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న సీనియర్ అసిస్టెంట్ బివి.బాలాజీని ఎక్కడికి బదిలీ చేశారో ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. బాలాజీని ఎక్కడికి మార్చారన్న విషయంపై స్పష్టత లేదు. ఇప్పటికీ రెవెన్యూ విభాగంలో కీలకమైన ఏ-1 అసిస్టెంట్ సీటుకు ఎవరినీ నియమించకపోవడం గమనార్హం. రెవెన్యూ వసూళ్లకు సంబంధించిన డీడీలు చెక్కులు తదితర అంశాలు ఆ అధికారి పరిధిలోకే వస్తాయి. గతంలో ఆ సీట్లో పనిచేసిన ఓ ఉద్యోగి నిర్వాకంతో ఆస్తి, నీటి పన్నుల చెల్లింపు రూపంలో పంపిన డీడీలు, చెక్కులను బ్యాంకులో జమ చేయకుండా ఆయన వద్దనే అట్టిపెట్టుకుని లక్షలాది రూపాయలు కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లే చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న షరీఫ్ ఖాన్‌ను ఇంజినీరింగ్ విభాగంతో సంబంధం లేని స్థానంకు మార్చారు. ఇలా కార్పొరేషన్‌లో ప్రతి బదిలీ కూడా లోప భూయిష్టంగా తయారుచేసి నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుత కమిషనర్ పివివి.ఎస్.మూర్తి ఈ బదిలీలపై జోక్యం చేసుకుని పరిశీలిస్తే అసలు వాస్తవాలు బహిర్గతం అవుతాయన్న చర్చ కార్పొరేషన్‌లో నడుస్తోంది.

మొక్కలను నాటడం అధికారుల బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

ఉద్యోగులు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడానిన బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సూచించారు. అనంతపురం కలెక్టరేట్ ఆవరణంలో హరిత అనంతలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా మొక్కలు నాటి, కలెక్టరేట్ ఉద్యోగులందరితో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు దత్తత తీసుకున్న మొక్కలకు రోజూ నీరు పోసి ఫొటో ఆన్లైన్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఎవరి చెట్లకు వారే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, ట్రెజరీ డిడి సరళ కుమారి, డీఎస్ఒ శోభారాణి, డిపిఎం ఆనంద్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, హార్టికల్చర్ ఏడీ లక్ష్మీప్రసన్నతో పాటు కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్

పురాతన కట్టడాలను పరిరక్షిద్దాం : కలెక్టర్

పాత ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

పురాతన కట్టడాలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ వద్దనున్న పాత ఆర్డీవో కార్యాలయం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురాతనమైన పాత ఆర్డీవో కార్యాలయం, జిల్లా జైలును అభివద్ధి చేసి, టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామిరెడ్డి, సర్వేయర్ ప్రతాపరెడ్డి, ఆర్ఐ సందీప్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్లను తనిఖీ

అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్, జెఎన్‌టియు కళాశాల గోడౌన్లను కలెక్టర్ బుధవారం నాడు పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జి.రామకష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, డిటి దివాకర్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై దాడులు హేయం : ఎస్‌ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

దేశం, రాష్ట్రంలో విద్యార్థినులపై ఇటీవల జరుగుతున్న దాడులు అత్యంత హేయమైనవి, వీటిని అరికట్టేందుకు పూర్తిస్థాయిలో నిర్భయ చట్టం అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు కూడలి నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు వందలాది మంది విద్యార్థులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, ఉపాధ్యక్షులు వైటిసి.రమేష్ మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. కేంద్రంలో నాల్గవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మహిళలకు ప్రధాన ఇస్తామని చెబుతున్నా మాటలు నీటిమూటలుగానే ఉన్నాయన్నారు. ఢిల్లీ జెఎన్‌యు యూనివర్సిటీలో విద్యార్థినులపై దాడులు జరుగుతున్నప్పటికీ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దీని మీద నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళలకు ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటోందన్నారు. నంద్యాల, విజయనగరంలో బాలికలపై జరిగిన దాడులకు సంబంధించిన ఘటనలపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టి మరోసారి ఇలాంటివి పునరావతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కోకన్వీనర్ పవిత్ర, జిల్లా నాయకులు వెంకటేష్, శివ, సోము, గణేష్ పట్టణ నాయకులు కిషోర్, జాకీర్, బాబి, సమీర్, శంకర్ పాల్గొన్నారు.

గుంతకల్లులో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రేపు పివికెకె కళాశాలలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని ఆలమూరు రోడ్డులో ఉన్న పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26వ తేదీ [24]7.ఎఐ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. బండి రమేష్‌బాబు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఏదైనా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి విద్యార్థులకు [24]7.ఎఐ సంస్థ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నామన్నారు. రాత, ముఖాముఖి ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని, అర్హత సాధించిన వారికి బెంగళూరులో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 26వ తేదీ ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్, రెజ్యూమ్‌తో పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో హజరు కావాలని ప్రాంగణ నియామక అధికారి డా.భానుకిరణ్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు.

మంత్రి లోకేష్‌తో శింగనమల నాయకులు

మంత్రి లోకేష్‌ను కలిసిన శింగనమల నాయకులు

అనంతపురం : శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి బుధవారం అమరావతిలోని సెక్రటేరియేట్‌లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వారితో పాటు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు ఉన్నారు. అలాగే తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శింగనమల మండలంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మంత్రి లోకేష్‌తో దండు శ్రీనివాసులు

దుకాణాల తరలింపుపై చర్చిస్తాం : ఎంపీడీవో

నార్పల : పట్టణంలోని సంత మార్కెట్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయంపై ఎంపీడీవో రాముడు స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సంత మార్కెట్ రోడ్డులో ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణాలను స్థానిక కోటవీధిలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌లోకి తరలించడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తా మన్నారు. మండల విస్తరణ అధికారి శైలజారాణి, మేజర్ పంచాయతీ సర్పంచి సుప్రియ, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, పాలకవర్గం సభ్యులతో చర్చించడంతో పాటు కూరగాయల దుకాణాల దారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను వారికి వివరించి సాధ్యమైనంత త్వరలోనే మార్కెట్ మార్పుపై నిర్ణయం తీసుకొని ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాగునీటి సమస్యపై వినతి

నార్పల : తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండలంలోని గడ్డం నాగేపల్లి గ్రామంలోని వడ్డెర కాలనీ మహిళలు ఎంపీడీవో ఏసీ రాముడుకు వినతిపత్రం సమర్పించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ వడ్డెర కాలనీలో ఆరు నెలల నుంచి తాగునీటి సమస్య నెలకొందని, విధి లేని పరిస్థితుల్లో సమీప వ్యవసాయ పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీ కోసమే ప్రత్యేకంగా గ్రామంలో బోరువేసినప్పటికీ నీరు మాత్రం సరఫరా కావడంలేదని వాపోయారు. స్పందించిన ఎంపీడీవో వడ్డెర కాలనీకి రోజూ 2 గంటలు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీదేవి, హర్షవర్ధన్‌ను ఆదేశించారు.

పీర్ల మకానం మరమ్మతులకు ఆర్థికసాయం

పామిడి : స్థానిక 14వ వార్డులో ఉన్న పీర్ల మకానం మరమ్మతులకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ రూ. 5 వేలు విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని బుధవారం స్థానిక టిడిపి నాయకులు పీర్ల మకానం నిర్వాహకులకు అందజేసి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తేల్ బాషా, మన్సూర్, బాషా, రఫీ, బావలి, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

31న మండల మీట్

బెళుగుప్ప : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీ ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై సమావేశంలో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. జడ్పిటిసి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి ప్రాధాన్యతపై హర్షం

శింగనమల : కేంద్ర బడ్జెట్‌లో ఎపికి ప్రధాన్యత ఇచ్చి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం హర్షణీయమని జనసేనపార్టీ మండల అధ్యక్షులు తోట ఓబులేసు పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సఫలం అయ్యారన్నారు. వెనకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపు వల్ల కరువు జిల్లా అనంత అభివృద్ధికి బాటలు వేసినట్లయిందన్నారు. హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌తో ఇండస్ట్రియల్ అభివృద్ధి జరిగి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయ న్నారు. రైల్వే, విద్యుత్తు ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు, పోలవరం పూర్తికి సంపూర్ణ సహకారం ఉంటుందని కేంద్రం బడ్జెట్‌లో పేర్కొనడం సంతోషించదగ్గ విషయమన్నారు.

సిఎం చంద్రబాబు కృషితో ఎపికి మంచి రోజులు

టిడిపి అధినేత, సిఎం నారా చంద్రబాబునాయుడు కృషి వల్లనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని ఆ పార్టీ నాయకులు కాయల రమణ యాదవ్ పేర్కొన్నారు. అందుకు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుకి సంబంధించి చేసిన ప్రకటనలే నిదర్శనమన్నారు.

'చెట్లను రక్షిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం'

శింగనమల : 'చెట్లను రక్షిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం... టిడిపి సీనియర్ నాయకుడు అట్టే రామాంజ నేయులు పిలుపునిచ్చారు. మండలంలోని శోధనపల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం టిడిపి సీనియర్ నాయకుడు లాయర్ ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ మొక్కలు నాటి పరిరక్షించడం వల్ల పర్యావరణానికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. చెట్లు గాలి, నీడ, పచ్చ దనం, కలప ఇస్తాయన్నారు. కాలుష్యాన్ని నియంత్రిస్తాయని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసేందుకు దోహదం చేస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బయపు రెడ్డి, నాయకులు పేట శివారెడ్డి, పేట ప్రసాద్‌రెడ్డి, ఏకల ఆదినారాయణ, అట్టే శ్రీనివాసులు, చిన్న చౌడప్ప, శంకర, ఈడిగ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మెక్కనాటి నీరు పోస్తున్న టిడిపి నాయకులు

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలి

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్‌డిఒ రాణిసుస్మితకు నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహించకపో వడంతో గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గణేష్, కార్యదర్శిగా ధనుష్, సహాయ కార్యదర్శులుగా రాకేష్, హరికృష్ణ, సభ్యులుగా హర్ష, సంతోష్, పవన్, బాబా, అనిల్, తదితరులు ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని, పాలకులను డిమాండ్ చేశారు.

కళ్యాణదుర్గం ఆర్డీవో రాణిసుస్మితకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శింగనమల : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పున:ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఉపాధ్యక్షులు రాచేపల్లి సూర్యప్రకాష్, తరిమెల గిరి డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారని, అయితే వైసిపి ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపి వేసిందన్నారు. దీంతో మారుమూల గ్రామాల నుంచి వచ్చే విద్యా ర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం జూని యర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరిం చాలని కోరారు. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని, శింగనమలలో చదువుతున్న విద్యార్థులకు అనుకూలంగా బస్సు సౌకర్యం కల్పించాలని, సైన్స్ గ్రూప్స్ ఏర్పా టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యదర్శిగా జాన్సన్, అధ్యక్షులుగా సాయిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జాన్సన్, సాయి, వినోద్, గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

శింగనమలలో విద్యార్థుల సమస్యలపై మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రాయదుర్గం : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకాన్ని పున:ప్రారంభించాలని ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి తహశీల్దార్ చిట్టి బాబుకు వినతి పత్రం అందజేశారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంత రాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాలని, బకాయి మెస్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని, హాస్టళ్ల విద్యా ర్థుల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు అభిషేక్, కార్తీక్, విజయేంద్ర, భరత్, మనోజ్, మహేంద్ర, విఠల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొల్పిన కవి జాషువా

వర్థంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పిన మహాకవి గుర్రం జాషువా అని వక్తలు కొనియాడారు. జాషువా వర్థంతి సందర్భంగా బుధవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల కామర్స్ సెమినార్ హాలులో జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఎస్కేయు తెలుగుశాఖ ఆచార్యులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షతన జాషువా సాహితీ సదస్సు నిర్వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్, సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య మాట్లాడుతూ జాషువా సాహిత్యం విశ్వ జనీనమైందని, పండితులు, పామరులకు సరళంగా అర్థమయ్యే సాహిత్యమని, నేటి యువతరానికి ఎంతో అవసరమన్నారు. ప్రధాన వక్తగా హాజరైన జనప్రియ కవి ఏలూరు యంగన్న మాట్లాడుతూ వర్ణ, వర్గ సమాజం పోవాలని బలంగా పోరాడారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎసిఆర్.దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ జాషువా సాహిత్యం ద్వారా సామాజిక విప్లవాన్ని కోరుకున్నారన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జాగర్లపూడి శ్యామసుందరశాస్త్రి మాట్లాడుతూ కావ్యాల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి జాషువా అన్నారు. ఎల్‌కెపి అధ్యక్షులు డాక్టర్ గాజుల వెంకటసుబ్బయ్య, ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకుడు డాక్టర్ అంటే శ్రీనివాస్, ఎస్కేయు తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ అంకే రామలింగయ్య జాషువా సాహిత్యంపై ప్రసంగించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేత విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం లోని మహాకవి గుర్రం జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగిరెడ్డి గారి అశ్వర్థరెడ్డి, ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ యోగేశ్వరనాయుడు, డాక్టర్ అంకె శ్రీనివాస్, డాక్టర్ అంకే మదన్‌మోహన్, హెచ్.రామచంద్ర, బిసి.లక్ష్మన్న, పూజారి ఈరన్న, ఓబుళపతి, హరి, ఓబులేసు, దాసరి ఆదినారాయణ, టీవీ.రెడ్డి, రియాజ్‌అహ్మద్, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విశాలాంధ్ర బుక్ హౌస్ సిబ్బంది, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జాషువా వర్థంతి సభలో పాల్గొన్న ప్రముఖులు

గుర్రం జాషువా, కాటన్‌కు నివాళి

గుత్తి : పట్టణంలో బుధవారం ప్రముఖ కవి గుర్రం జాషువా, సర్ ఆర్థర్ కాటన్ వర్థంతి సభలు ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జె.కుళ్లాయిబాబు, నాయకులు నారాయణరెడ్డి, వెంకటేష్, శామ్యూల్, షేక్షావలి, హసన్‌అహ్మద్, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, రామదాసు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

హరిత అనంత జిల్లాగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి-వజ్రకరూరు

హరిత అనంత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని ఉరవకొండ మండల వ్యవసాయ అధి కారి శుభకర్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మండలంలోని ఆమిద్యాల, మోపిడి గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, రైతులతో కలిసి మొక్కలు నాటారు. ఏవో మాట్లాడుతూ చెట్లే జీవకోటికి ప్రాణధారమని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. చెట్ల వల్ల వాతావ రణం కలుషితం కాకుండా జీవకోటికి మేలు జరుగుతుందన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాలను సందర్శించి కౌలు రైతులతో ముఖా ముఖి నిర్వహించి ప్రతి కౌలుదారుడు కచ్చితంగా మీ సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారితో కౌలు రైతుకార్డు తీసుకోవాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో ప్రభుత్వం అందిం చే సబ్సిడీలు, అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతా రన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇంకా చాలా మంది రైతులు విత్తనం వేయలేదని, దీంతో ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, ప్రత్యామ్నాయ విత్తనాలు వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది మీనాక్షి, పరిమళ, చిక్కన్న, గోపాల్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

మెక్క నాటుతున్న వ్యవసాయ అధికారులు

అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న పాఠకులు

అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు, పత్రికా సంపాదకులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సభ నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.కమ్మన్న ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పౌర గ్రంథాలయాల ఏర్పాటుకు అయ్యంకి ఉద్యమం చేశారన్నారు. తద్వారా నేడు రాష్ట్ర వ్యాప్తంగా పౌర గ్రంథాలయాలకు మనుగడ, గుర్తింపు వచ్చిందన్నారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం గౌరవ సూచికంగా పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసిందన్నారు. ఏటా అయ్యంకి జయంతి వేడుకను రాష్ట్ర వ్యాప్తంగా పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, రికార్డు అసిస్టెంట్ సి.రాము, పాఠకులు, సర్దార్ వల్లభాయ్ పటేల్, మున్సిల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

'శిక్ష సప్తాహ్'లో భాగంగా బుధవారం డి.హీరేహాల్ మండలంలోని హెచ్.సిద్దాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గౌరీశంకర్ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పిఇటి హనుమంతరాయుడు పర్యవేక్షణలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడలు, ఆటల పోటీలు విద్యార్థుల్లో శారీరక ఉల్లాసం, మనోవికాసం కలిగిస్తాయన్నారు. విద్యార్థులకు క్రీడలు, శారీరక వ్యాయామంలో శిక్షణ ఇస్తే శారీరక, మానసిక అభివృద్ధి కలుగుతుంద న్నారు. అనంతరం విద్యార్థులకు ప్రాచీన క్రీడలైన తొక్కుడు బిళ్ల, అష్టాచమ్మ, కబడ్డీతో పాటు ఖోఖో, వాలీబాల్, పరుగు పందెం, తదితర అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మైదానంలో విద్యార్థుల క్రీడా సంబరాలు

చంద్రబాబు, మోదీ, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

గుత్తి : అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై పట్టణం లో బుధవారం టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో గాంధీ గాంధీ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంకె.చౌదరి, పి.శ్రీకాంత్ చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, బర్దివలి, పి.రవితేజ, దిల్‌కా శీన, బోయ వేణుగోపాల్, కోనంకి కృష్ణ, ఎ.పులికొండ, కరిడికొండ సుధాకర్ నాయుడు, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ అబ్దుల్ జిలాన్, డైరెక్టర్లు కృష్ణ, జక్కా వీరన్న, న్యాయవాది సోము, తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జలశక్తి అభియాన్ పనులను

వేగవంతం చేయాలి

ఎన్‌ఆర్‌ఈజిఎస్‌లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవాలి

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో జలశక్తి అభియాన్(జెఎస్‌ఎ-సిటిఆర్-2024) పనులను నవంబర్ నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ డ్వామా అధికారులను ఆదేశిం చారు. కలెక్టర్ బుధవారం నగరంలోని డ్వామా కార్యాలయ మీటింగ్ హాల్‌లో జలశక్తి అభియాన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జలశక్తి మిషన్‌ను వేగవంతం చేసేందుకు ఆర్‌డబ్ల్యుఎస్, అనుబంధ శాఖల వారితో కలిసి డ్వామా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. త్వరగా జిఐఎస్ ట్యాగింగ్ చేయాలన్నారు. జలశక్తికి సంబంధించి ఎపిఒ, ఎపిడి, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్స్‌తో అధికారులు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి వారికి నిర్దేశిత లక్ష్యాలను కేటాయించి వాటిని చేరుకునేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం పంపే నివేదికలో ఫిష్ పాండ్ జతపరిచాలని ఆదేశించారు. ఎన్‌ఆర్‌ఈజిఎస్ పనులకు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండేలా అధికారులందరూ సమిష్టిగా నిబద్ధతతో పని చేయాలన్నారు. మొక్కల పెంపకం, నీటి నిల్వల పెంపునకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. జలశక్తికి సంబంధించి పర్యవేక్షించేందుకు ఎపిడిని కానీ, ఓ మంచి అధికారిని కానీ నియమించాలని ఆదేశించారు. అనంతరం జలశక్తి మిషన్ ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ తిలకించారు. సమావేశంలో డ్వామా పిడి వేణుగోపాల్‌రెడ్డి, సిసి అండ్ ఎఎలు ప్రతాప్, సతీష్, ఈసీ ఈశ్వరయ్య, ఎఒ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ రాధా, ఎపిడిలు, ఎపిఒలు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా గురువులను సన్మానిస్తున్న వివేకానంద యోగా కేంద్రం నిర్వాహకులు

యోగా గురువులకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

గురు పౌర్ణమి పురస్కరించుకొని వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం శివాలయం యోగా కేంద్రంలో యోగా గురువులు ఈఎన్.మారుతిప్రసాద్, జయకర్‌లను ఘనంగా సన్మానించారు. వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, దివాకర్, ఆంజనేయులు, తారకరామయ్య, పుల్లయ్య, కృష్ణ, శ్రీనివాసులు, మహేష్, రత్నమయ్య, సుశీల, నాగమణి, తదితరులు హాజరై యోగా నిత్య సాధన వల్ల కలిగే ఉపయోగాలను తెలిపారు. నగర ప్రజల కోసం యోగా గురువులు రెండు దశాబ్దాలుగా వివేకానంద యోగా కేంద్ర తరఫున నిర్వహిస్తున్న ఉచిత యోగా కార్యక్రమాలను కొనియాడారు. ప్రతిరోజూ ఉదయం 5:30 గంటలకు శివాలయం, ఆర్ట్స్ కాలేజ్, సరస్వతీ విద్యా మందిర్, జిల్లా పరిషత్, కమ్మ భవన్, షిర్డీ నగర్ యోగా కమ్యూనిటీ హాల్‌లో ఉచిత యోగా తరగతులు, సాయంత్రం 5 గంటలకు కమ్మ భవన్‌లో కేవలం మహిళలకు, సాయంత్రం విద్యారణ్య ఓరియంటల్ స్కూల్‌లో, ఉదయం ఆజాద్ నగర్‌లో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తామని, నగర ప్రజలు హాజరై తమ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని వివేకానంద యోగా కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

జూటూరు బాలికల హాస్టల్ తనిఖీ

పెద్దపప్పూరు : మండలంలోని జూటూరు గ్రామంలో ఉన్న బీసీ బాలికల హాస్టల్‌ను బుధవారం ఎంపీడీవో కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాలికలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే భోజనాలు, మెనూ, తదితర అంశాలపై ఆరా తీశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ నిర్వాహకులను ఆదేశించారు. ఆమె వెంట బాలికల హాస్టల్ నిర్వాహకులు, పంచాయతీ సెక్రెటరీ, తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

పోతురాజుకట్ట గుడిలో చోరీ

పామిడి : స్థానిక పోతురాజు కట్ట వీధిలో ఉన్న పోతురాజు కట్టగుడిలో మంగళవారం రాత్రి దుండగులు హుండీ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. పూజారి మధు దంపతులు బుధవారం ఉదయం ఆలయానికి వెళ్లగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడాది నుంచి హుండీ తెరవలేదని, అందులో రూ. 5 వేలు ఉండవచ్చని పేర్కొన్నారు. పోలీసులు ఆలయన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

వజ్రకరూరు : ఉరవకొండ పట్టణంలోని గవిమఠం వద్ద కొన్ని నెలలుగా మతి స్థిమితం సరిగా లేని ఓ యువకుడు(18) ఉండేవాడు. అతడు బుధవారం మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఉరవకొండ ఎస్‌ఐ రాఘ వేంద్రప్ప, ఆపద్బాంధవ ట్రస్ట్ అధ్యక్షులు వేల్పుల మురళి, పంచా యతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ అక్కడికి చేరకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆపద్బాంధవ ట్రస్ట్ సభ్యులు, పోలీసులు, గ్రామపంచాయతీ సిబ్బంది కలిసి వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహిం చారు. మృతుడిని బీహార్ రాష్ట్రంలోని శివన్ జిల్లా జామూ గ్రామానికి చెందిన బీజాయ్‌కుమార్‌గా గుర్తించారు. కార్యక్రమంలో ఆపద్బాంధవ ట్రస్ట్ సభ్యులు వేల్పుల మురళి, నూర్‌బాషా, భీమేష్, అశోక్, రమేష్, నవీన్, హెడ్ కానిస్టేబుల్ జయకుమార్, కానిస్టేబుల్ సోమశేఖర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన

అనంతపురం జిల్లా
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
రాప్తాడు, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, యల్లనూరు, కంబదూర్, ఉరవకొండ రూరల్

ఇంటర్వ్యూ : తేది: 26-07-2024 శుక్రవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,313

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం,
D.No: 42/2, Near Industrial Estate, Old VRL Transport Godown,
Bellary Road, Ananthapuramu

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE:ANANTHAPURAMU

E.P.No:452/2024 in O.S.No:32/2023

Between:
C.Bayapa Reddy (died) by L.Rs, C.Manjula and Others ...**Decree Holders**

And

S.Thejovathi Devi @Thejavathi Devi ...**Judgement Debtor**

Notice to J.Dr

To,
శ్రీమతి ఎస్.తేజోవతి దేవి @ తేజావతి దేవి W/o కె.సాయి వీర ప్రసాద్, డోర్ నెం.305,4-734-38, మహబూబ్ టవర్స్, జార్జిపేట, అనంతపురం నగరం.

పై దావాలోని తీర్పు రుణగ్రహీత (Judgement Debtor) అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 09/08/2024 వ తేదికి వాయిదా వేసినారు. కావున పై తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరాలు తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని ఎడల పై E.P.No:452/2024 మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

రాచమల్లు హరినాథరెడ్డి
ఇ.లక్ష్మీకాంతయ్య
డి.సూర్యచంద్ర
న్యాయవాదులు